క్లుప్తంగా

ఓటు నమోదు చేసుకోవాలి



ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

చింతకాని: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం కల్పించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యావతి, ఉషా, బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

సత్తుపల్లి: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలురు) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంపీసీలో 14, బైపీసీలో 22 ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి పాసైన విద్యార్థులు సర్టిఫికెట్లతో ఈ నెల 28న కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సోషల్ వెల్ఫేర్ గురుకులంలో..

కారేపల్లి: కారేపల్లి శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కందాల లిల్లి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ-15, బీసీ-2, ఓసీ-1, మైనార్టీ-1, ఎస్టీ-2, బైపీసీ గ్రూప్‌లో ఎస్సీ-11, బీసీ-5, మైనార్టీ-1, ఎస్టీ-1 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కారేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

గణేష్‌పాడు యువకుడికి ఎంబీబీఎస్ సీటు



విష్ణు వర్ధన్

పెనుబల్లి: మండలంలోని గణేష్‌పాడు గ్రామానికి చెందిన మల్లెల విష్ణు వర్ధన్ ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించాడు. నీట్ పరీక్షలో 2051 ర్యాంక్ సాధించి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో గ్రామస్తులు విష్ణు వర్ధన్‌ను అభినందించారు.

కేజీబీవీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలలో కొత్తగా చేరిన బాలికలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మొగిలి అప్పారావు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఒకరినొకరు ఆప్యాయతగా పరిచయం చేసుకుని ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పకట్లపాలెంలో తాగునీటి బోరు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో తెల్లబోయిన రాములు జ్ఞాపకార్థం ఆయన పిల్లలు రూ.50 వేలతో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. ఆయన కుమారులు కృష్ణయ్య, ముత్తయ్య, కుమార్తె కృష్ణకుమారి మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ఈ బోరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, గురవయ్య, సర్పంచ్ సుబ్బారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కంప్రెసర్ ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ముదిగొండ: కంప్రెసర్ ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. నేలకొండపల్లి మండలం రాయిగూడేనికి చెందిన వెంకన్న కంప్రెసర్‌ట్రాక్టర్ ఇంజన్‌తో వెళ్తుండగా వల్లభిలో అదుపుతప్పి ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. ఈ క్రమంలో వెంకన్నకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

హరితోత్సవం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం అన్ని మండలాల్లో హరితహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం వలన వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించడంతో పాటు సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుబల్లి: పులిగుండాల ప్రాజెక్ట్ వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తదితరులు



వైరా: మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్



సత్తుపల్లిరూరల్: గంగారం 15వ బెటాలియన్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ హైమావతి



మధిర: మొక్క నాటుతున్న సర్పంచ్ సంధ్యారాణి



కల్లూరులో..



సత్తుపల్లిటౌన్: నాటిన మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్



ఏన్కూరు: మొక్కలు నాటుతున్న ఎంపీపీ వరలక్ష్మి



సత్తుపల్లిరూరల్: కిష్టారంలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు, సర్పంచ్ రేణుక



కల్లూరురూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో..



ఎర్రుపాలెం: గురుకుల పాఠశాలలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, అధికారులు



సత్తుపల్లి: బుగ్గపాడులో..



కొణిజర్ల: పెద్దగోపతిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి, అధికారులు



చింతకాని: గాంధీనగర్‌కాలనీలో మొక్క నాటుతున్న జెడ్పీటీసీ కిషోర్, ఎంపీపీ పూర్ణయ్య

మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

మధిర/వైరా/సత్తుపల్లిటౌన్/ఎర్రుపాలెం: మధిరలోని శ్రీనిధి పాఠశాలలో, సత్తుపల్లిలోని కొత్తూరు మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అదే విధంగా వైరాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ వీడీజీ-2 నంబూరి మధు, గాట్ అంబాసిడర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణలు కోటయ్య ఆస్పత్రి వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎర్రుపాలెంలోని జమలాపురం గ్రామంలో శ్రీబాలాజీ భవన్ వృద్ధాశ్రమంలో మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కిండ్లే రూరల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు అనూష ఆశ్రమంలోని వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యుగోస్లేవియా దేశంలో పుట్టి భారతదేశానికి ఉపాధ్యాయురాలిగా వచ్చి ఆమె అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. తోటి వారికి సాయం చేసేందుకు తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసిన మహామూర్తి అని పేర్కొన్నారు. భారతీయులతో అమ్మ అని పిలిపించుకున్న మహోన్నత వ్యక్తి అని, విద్యార్థులు ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందు, వెంకటనారాయణ, క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, డాక్టర్ కోటయ్య, కళాశాల ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.రామకృష్ణారెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు కర్నాటి శ్రీనివాసరెడ్డి, గుర్రాల వెంకటరావిరెడ్డి, సొసైటీ సభ్యులు పుల్లారెడ్డి, సత్యనారాయణ, రవినాయక్ తదితరులు ఉన్నారు.



వైరా: మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



మధిర: నివాళి అర్పిస్తున్న అంజన్‌బాబు, విద్యార్థులు



ఎర్రుపాలెం: జమలాపురంలో..



సత్తుపల్లిరూరల్: మదర్‌థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

సభను విజయవంతం చేయండి



తల్లాడ: మాట్లాడుతున్న అసోం ఎమ్మెల్యే రామకృష్ణ గోష్

తల్లాడ: ఖమ్మంలో ఆదివారం జరుగనున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని అసోం ఎమ్మెల్యే రామకృష్ణ గోష్ పిలుపునిచ్చారు. శనివారం తల్లాడలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కారణంగా అసోంవంటి రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర సహకారంతో పేదలకు అద్భుతమైన పథకాలు అందుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం భూములను అమ్మే స్థాయికి దిగజారి పోయిందన్నారు. ఇందుకు కేసీఆర్ కుటుంబ పరిపాలనే కారణమన్నారు. కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ వీరంరాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ బాలాజీ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, మండల కార్యదర్శి రమేష్, నాగేశ్వరరావు, నరసింహ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు రణభేరికి తరలిరండి..

మధిర: ఖమ్మంలో ఆదివారం జరిగే రైతు రణభేరి బహిరంగ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు, రైతులు వేలాదిగా తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మధిర నియోజకవర్గం కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మధిర బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్ నుంచి పార్టీ కార్యకర్తలను, అభిమానులను అధిక సంఖ్యలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాలక్ పాపన్న, వెంకటనారాయణ రెడ్డి, విజయరాజు, సాంబశివరావు, రమేష్, స్వర్ణాకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రాందాస్ నాయక్

వైరా: వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం వైరాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో వైరా మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, నరసింహారావు, హరినాద్, అశోక్, కొండలు, రాజా, వీరయ్య, వీరభద్రం, రామారావు, రామకృష్ణ, బాబు, హన్మంతరావు, నరసింహారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు వినియోగం తగ్గించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్ రావు

మధిర: ఆరోగ్యానికి హానికరమైన ఉప్పు వినియోగాన్ని తగ్గించాలని మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్ రావు కోరారు. మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం నిధానపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని తల్లులకు, గర్భిణులకు రక్తహీనత, ఐరన్ మాత్రలు, టీకాల ప్రాధాన్యత, పోషకాహారం, తల్లిపాల ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ వారి కోసం కాంబినేషన్ డ్రగ్స్ అందుబాటులోకి వచ్చాయని, రెండు మాత్రలు వేసుకోకుండా ఒకే మాత్ర వేసుకుంటే సరిపోతుందన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. జంక్ ఫుడ్ తింటే కలిగే అనర్థాల గురించి తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, రాజ్యలక్ష్మి, లలిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఆశా’ల సమస్యలు పరిష్కరించాలి



చింతకాని: తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు

మధిర/చింతకాని/ఏన్కూరు: ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు శనివారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆశాకార్యకర్తలు తహసీల్‌లో ఆర్ఐ రమాదేవికి, చింతకాని తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శీలం నరసింహారావు, మడుపల్లి గోపాలరావు, ఏర్పుల రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే అనేక రకాల పనుల్లో ఆశా కార్యకర్తలు తీరికలేకుండా పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం చెల్లించడం లేదని, పని భారంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల 1న పారితోషకాలు చెల్లించాలని, జాబు చార్టును విడుదల చేయాలని కోరారు. 2021 పీఆర్సీ, ఏరియర్స్ చెల్లించాలని, 32 రకాల రిజిస్టర్‌లను ప్రింట్ చేసి ప్రభుత్వం చెల్లించాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా కార్యకర్తలకు రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రసూతి సెలవులు ఇవ్వాలని, లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో సీఐటీయూ నాయకులు దేశబోయిన ఉపేందర్, ఆశ కార్యకర్తలు కొప్పెర కమల, అరుణ, సుహాసిని, రాంబాయి, బీజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

జ్యేష్ట లక్ష్మణ్‌రావుకు ఘన నివాళి..

సత్తుపల్లిరూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన జ్యేష్ట లక్ష్మణ్‌రావుకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ వేర్వేరుగా మృతుడి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వారి వెంట జెడ్పీటీసీ రామారావు, హరికృష్ణారెడ్డి, వెంకట్రావు, ప్రసాద్, ఎంపీటీసీ సునీత, రాజు, రవి, అప్పారావు, నరేంద్ర, విష్ణు, డీసీసీబీ డైరెక్టర్ పుల్లారావు తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి ఏలియాకు..

సత్తుపల్లిరూరల్: రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పాస్టర్ కొత్తపల్లి ఏలియా అనారోగ్యంతో శుక్రవారం హైద్రాబాద్‌లో మృతి చెందటంతో ఆయన భౌతికగాయాన్ని శనివారం స్వగ్రామమైన సత్తుపల్లి మండలం గంగారం ప్రకాష్‌నగర్ కాలనీకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి కొత్తపల్లి ఏలీయా భౌతికగాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కమల్‌పాషా, భరత్, రాకేష్ ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పెనుబల్లి : మూడు రోజుల క్రితం మండాలపాడు వద్ద మృతి చెందిన అనాథ వ్యక్తి మృతదేహానికి పెనుబల్లి పంచాయతీ సిబ్బంది, మసీదు కమిటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తావు నాయక్‌తో పాటు మసీదు కమిటీ ప్రెసిడెంట్ యాకూబ్ పాషా, శ్రీనివాసాచారి, అబ్దుల్ సలాం, ఆస్పత్రి సిబ్బంది పాపారావు, పంచాయతీ సిబ్బంది వెంకటేశ్వరరావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు మృతదేహాన్ని పెనుబల్లి శ్మశాన వాటికకు తరలించి అంత్య క్రియలు నిర్వహించారు.

ప్రమాదకరంగా ‘భగీరథ’ గుంత..

కల్లూరురూరల్: గత మూడునెలల క్రితం మండలంలోని చిన్న కోరుకొండిలో మిషన్ భగీరథ పైపులైన్ లీక్ అయ్యింది. ఈ క్రమంలో భగీరథ అధికారులు జేసీబీతో భారీ గుంతలు తీసి లీకేజీ పనులు పూర్తిచేయకుండానే వదిలేశారు. దీంతో ఆ గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మర్లపాడు క్రాసురోడ్డు వద్ద తీసిన భారీ గుంత

బోటని బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్, కళాశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోటనీ సబ్జెక్ట్ బోధించటకు అవర్లీ టీచర్ కావాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (బోటని), బీఎడ్ కనీస అర్హత కలిగి ఉండి, ఇంగ్లీష్ మీడియంలో చదివిన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ లోపు సంబంధిత ధ్రువ పత్రాలతో కారేపల్లి మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతతో పాటు, అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని, నెలకు గరిష్టంగా రూ.18 వేలు గౌరవ వేతనం అందజేయబడుతుందని తెలిపారు. ఆశక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖమ్మం అసెంబ్లీకి రామకృష్ణ దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న రామకృష్ణ

సత్తుపల్లి: ఖమ్మం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సత్తుపల్లి ఆత్మకమిటీ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, రావి శ్రీనివాసరావు, వృద్ధి చౌదరి, భూక్యా శివకుమార్, జ్యేష్ట సత్యనారా యణచౌదరి, అడపా అనీల్ చౌదరి ఉన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కల్లూరు రూరల్: మండలంలోని క్రిష్ణయ్య బంజరు గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచ్ పెద బోయిన ప్రమిలా దేవి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహకారంతో మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆసీఫ్, వార్డు సభ్యులు, పుల్లాచారి, రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస రావు, నర్సింహాచారి, శ్రీరాములు, వేణు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బాణాపురంలో కుక్కల హల్‌చల్..



ముదిగొండ మండలంలోని బాణాపురంలో వీధికుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. ఏ వీధిలో చూసిన కుక్కల బెడద తప్పడం లేదని వాపోతున్నారు. ఎటునుంచి వచ్చి ఎటాక్ చేస్తాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. రాత్రి వేళల్లో ఎక్కడపడితే అక్కడ సంచరిస్తున్నాయి. వృద్ధులు, దివ్యాంగులను పలుమార్లు కరిసిన సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో కుక్కల బెడద నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : నాగమని, పంచాయతీ కార్యదర్శి, బాణాపురం
సెల్ నంబర్ : 7981545940